నమస్తే తెలంగాణ
# మెదక్
I | హైదరాబాద్, గురువారం 26 డిసెంబర్ 2024 | MEDAK

## క్రిస్మస్ వేడుకల్లో
# ఎమ్మెల్సీ కవిత

మెదక్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): క్రిస్మస్ పండుగ సందర్భంగా మెదక్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, వంజరి జయరాజ్, మామిళ్ల ఆంజనేయులు, ఆర్కే శ్రీనివాస్, బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మెదక్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవితకు కేక్ తినిపిస్తున్న పద్మారెడ్డి


సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్

# నిజాం షుగర్ ఫ్యాక్టరీని తక్షణమే ఓపెన్ చేయాలి

- సీఎస్ఐ చర్చితో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది
- ఏసుప్రభు దయ వల్ల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి
- మెదక్ చర్చిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


మెదక్ చర్చిలో ప్రార్థనల అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత పక్కన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు

మెదక్, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా కేంద్రంలో ఉన్న ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ ఎప్పుడు తెరిపిస్తారో చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం క్రిస్మస్ పండుగ, వందేళ్ల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆమె మెదక్ చర్చిని సందర్శించారు. ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్, ప్రిసిబీటర్ ఇన్‌చార్జి శాంతయ్య ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ చర్చికి వచ్చి పోయారు.. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తక్షణమే ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్, బోధన్, కోరుట్ల, మెదక్‌లో చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని మండిపడ్డారు. ఎన్ని వందల కోట్లతో అయినా చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని చెప్పి ఇప్పటి వరకు దానిమీద సమీక్ష చేయకపోవడం దారుణమన్నారు. యావత్ తెలంగాణలో క్రిస్మస్ గిఫ్టులు, రంజాన్‌తోఫా, బతుకమ్మ చీరెలు ఎగ్గొట్టారని విమర్శించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చిని సందర్శించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. రూ. 14 లక్షలు ఖర్చు చేసి ఈ చర్చి నిర్మాణం చేపట్టారని, పది వేల మందికి పనికి ఆహార పథకం కింద ఈ చర్చి నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద చర్చిగా పేరుగాంచిందన్నారు. ఈ చర్చిలో ప్రార్థన చేయడం మామూలు విషయం కాదన్నారు. కేసీఆర్‌కు, క్రైస్తవులకు పేగుబంధం ఉందని, ఉద్యమంలో క్రైస్తవులు పాల్గొన్నారని గుర్తు చేశారు. సీఎస్ఐ చర్చితో నాకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. అనంతరం చర్చి ఆవరణలో కేక్ కట్ చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఎంపీపీల ఫోరం మాజీ అధ్యక్షుడు హరికృష్ణ, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, జయరాజ్, ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏసుప్రభు బోధనలు అనుసరణీయం

- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి


సిద్దిపేటలోని సీఎస్ఐ చర్చిలో చిన్నారులతో కలిసి హ్యాపీక్రిస్మస్ చెబుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


సిద్దిపేట చర్చిలో పిల్లలకు క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, డిసెంబర్ 25: ఏసుప్రభు బోధనలు అనుసరణీయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్‌తో కలిసి ఆయన పాల్గొని కేక్‌కట్ చేసి చిన్నారులకు తినిపించారు. అద్భుతంగా పాటలు ఆలపించిన చిన్నారులకు నగదు బహుమతి అందజేశారు. లయన్స్ క్లబ్, అభయ జ్యోతి సంస్థల ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ మనవులందరూ శాంతి, సౌభ్రాతృత్వం, సహనం, క్షమాగుణం, ఎదుటివారి పట్ల జాలి, దయ కలిగి ఉండాలని ఏసుప్రభువు బోధించారన్నారు. ఏసుక్రీస్తు జన్మించిన డిసెంబర్ మాసం వచ్చిందంటే క్రైస్తవులందరికీ సంతోషమన్నారు. ప్రపంచంలో ఎక్కువ మంది జరుపుకొనే పండుగ క్రిస్మస్ అన్నారు. దయాగుణం వల్లనే ఏసుక్రీస్తు గొప్పతనాన్ని ప్రపంచమంతా గుర్తించిందన్నారు. క్రిస్మస్ సందర్భంగా మీ అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పండుగపూట అందరూ సంతోషంగా ఉండాలని పేద క్రైస్తవులకు పదేండ్లు క్రిస్మస్ కానుకలు అందించారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అందించడం లేదన్నారు. ఏసు ప్రభువు చెప్పిన విషయాలన్నీ మనం జీవితంలో ఆచరించాలన్నారు.అప్పుడే ఏసు ప్రభు పట్ల మనం నిజమైనభక్తి చూపినవారమవుతామన్నారు. జక్కాపూర్ చర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పాల సాయిరామ్, మారుపల్లి శ్రీనివాస్ గౌడ్, క్రైస్తవ ప్రతినిధులు ప్రసాద్ రమేశ్, సత్యానందం, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వినోద్ మోదాని, జోజి పాల్గొన్నారు.

# అందరి ఆశీర్వాదం కావాలి

- మెదక్ చర్చి అభివృద్ధికి రూ.29 కోట్లు మంజూరు
- మెదక్ నియోజకవర్గంలో రూ.409.58 కోట్ల పనులకు శంకుస్థాపన
- ఏడుపాయల్లో అమ్మవారికి పట్టువస్ర్తాలు సమర్పణ
- మెదక్ చర్చిని సందర్శించిన సీఎం రేవంత్


మెదక్ జిల్లా ఏడుపాయల్లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి, దామోదర, కొండా సురేఖను ఆశీర్వదిస్తున్న ఆలయ పూజారులు

మెదక్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ)/పాపన్నపేట: అందరి ఆశీర్వాదం కావాలి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా మెదక్ చర్చిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్, ప్రిసిబీటర్ ఇన్‌చార్జి శాంతయ్య ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు పాపన్నపేట మండలంలోని వనదుర్గమాత ఆలయాన్ని సీఎం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు సీఎంకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, అటవీ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ఏడుపాయల వనదుర్గాభవాని మాతకు పట్టువస్ర్తాలు సమర్పించి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం మెదక్ నియోజకవర్గంలో రూ.409.58 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. మెదక్ చర్చి అభివృద్ధికి రూ.29 కోట్లతో శంకుస్థాపనలు చేశారు. ఏడుపాయల వనదుర్గాభవాని మాత ఆలయానికి వచ్చే ప్రధాన రహదారిని రెండు వరుసల రోడ్డుతో పాటు డివైడర్ ఫ్లడ్‌లైట్ల ఏర్పాటుకు రూ.35కోట్లు, మెదక్ జిల్లా కేంద్రంలో మహిళా శ్రీశక్తి భవన నిర్మాణం కోసం రూ.5 కోట్లు, గిరిజన తండాల్లో రవాణా సౌకర్యం కోసం రూ.52.76 కోట్లు, రూ.205 కోట్లతో యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణాల కోసం రూ.7.4కోట్ల పనులకు శంకుస్థాపన చేశా రు. అనంతరం వారికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులు రూ.102 కోట్ల చెక్కును స్వయం సహాయక సంఘాలకు అందజేయగా బ్యాంకు లింకేజీ కోసం అధికారులు ముఖ్యమంత్రికి అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీలు రఘునందన్‌రావు, సురేశ్‌శెట్కార్, ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే హనమంతరావు, జూకల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, నీలం మధు ముదిరాజ్, శ్రవణ్ కుమార్‌రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, చీఫ్ సెక్రటరీ సంగీత, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తోపాటు వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత అప్పు, సుప్రభాతరావు, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా ఇన్‌చార్జి ఆంజనేయులు, దుబ్బాక ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి హరికృష్ణ, ప్రశాంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోవిందనాయక్, నాయకులు భూమయ్య, సతీశ్, నరేందర్‌గౌడ్, గౌస్, మహేశ్‌గుప్తా, రాము, శ్రీనివాస్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఆధునిక సాంకేతికతతో
## ఉద్యాన పంటల సాగు
**ఉద్యానవర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి**

ములుగు, డిసెంబర్ 25: భవిష్యత్‌లో అత్యాధునిక సాంకేతికతతో ఉద్యాన పంటలు సాగు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బుధవారం 'జీఐఎస్ ఫర్ ప్లాంట్ బయోడైవర్సిటీ అండ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్' పై వర్క్‌షాప్ నిర్వహించారు. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను ఉపయోగించి ప్రపంచంలోని మొక్కల వనరులను అన్వేషించడం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌ను ఉపయోగించుకొని ఉద్యాన పంటల మ్యాపింగ్ చేస్తామన్నారు. భవిష్యత్‌లో ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉన్న అన్ని కూరగాయలు, పండ్ల మొక్కలు, ఔషధ మొక్కల డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, జీనం సీక్వెన్సింగ్ చేపిస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ టెక్నిక్, డీప్‌లెర్నింగ్ టెక్నిక్‌ను ఉపయోగించి మొక్కల నిర్దిష్టమైన మోడల్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జపాన్ కుమామోటో వర్సిటీ ప్రొఫెసర్ తకాశీవతనాబే, విష్ణు ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ డీన్ ఎడ్ల రాజు, రిజిస్ట్రార్ భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ రాజశేఖర్, వర్సిటీ అధికారులు చీనా, సైదయ్య, వీణ జోషి, జయశంకర్ స్వామి, నిఖిల్, మల్లేశ్, ప్రణీత్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి

- ఇచ్చిన హామీలు అమలు చేసే సోయి లేదా...
- తక్షణమే ప్రతి మహిళకు రూ.2500 ఇవ్వాలి
- 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీల పంపిణీ, తులం బంగారం ఏమైంది
- రైతు భరోసా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మెదక్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మెదక్ అర్బన్,డిసెంబర్ 25: మెదక్ చర్చికి వందేండ్ల చరిత్ర ఉందని, ఉపాధి కల్పించడానికి చర్చి నిర్మాణం చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా ఆమె మెదక్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ..మెదక్ ప్రాంతం జిల్లా కావాలనే కల ఉండేదని, అది కేవలం తెలంగాణ ఏర్పాటు తర్వాతనే కేసీఆర్ జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా ఏర్పాటు తర్వాతే అన్ని హంగులు మెదక్‌కు వచ్చాయని, ప్రత్యేకంగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల వచ్చిందన్నారు. మెదక్ అంటేనే ఒక పక్క ఏడుపాయల దుర్గమ్మ, ఒక పక్క చర్చి, మరో పక్క మంజీరా ఉందన్నారు. ఇక్కడ ఉండే పంటలు అద్భుతంగా ఉండేవని ఆనాడు శ్రీనాథుడు చెప్పాడని పదే పదే కేసీఆర్ చెబుతుండేవాడన్నారు. సింగూరు నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తీసుకువెళ్తుంటే ఘనపురం ఆయకట్ట రైతులకు నీళ్లు రాని పరిస్థితి ఉండేదన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ పట్టుబట్టి గోదావరి జలాలతో సింగూరు నింపి తద్వారా ఘనపురం ఆయకట్టును పరిరక్షించారన్నారు. మెదక్ జిల్లాలోని చెరువుల్లో పూడికలు తీసి 365 రోజులు చెరువుల్లో నీళ్లు ఉండాలని కేసీఆర్‌కు కల ఉండేదన్నారు. దాని కోసమే కాళేశ్వరం నుంచి ఇక్కడికి నీళ్లు తెచ్చుకోవాలని అనుకున్నాం కానీ ఆ పనులు ప్రస్తుత ప్రభుత్వం సగంలోనే ఆపడం దారుణమన్నారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఆగిపోయిందని విమర్శించారు. మెదక్ చర్చిని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు నెలకు రూ.2500, యువతులకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామనే ప్రకటన చేస్తారని ఆశించినా ఫలి తం లేదన్నారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు తక్షణమే స్కూటీలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టిందని మండిపడ్డారు.నిబంధనల పేరుతో రైతు భరోసా ఎగ్గొడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు కేవలం సన్నవడ్లకే పరిమితం చేసిందని, అది కూడా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు భిక్షపతి, మేడే రాజీవ్‌సాగర్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కృష్ణారెడ్డి, జయరాజ్, ఆర్కే శ్రీనివాస్, కిశోర్, అంజగౌడ్, లింగారెడ్డి, కృష్ణ గౌడ్, జుబేర్, నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల నిర్బంధంపై హరీశ్‌రావు ఫైర్


మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

- మెదక్‌కు సీఎం రాక సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల టెంట్ తీయించిన పోలీసులు
- మెదక్ రూరల్ పీఎస్‌లో ఉద్యోగుల ధర్నా

మెదక్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టరేట్ ఎదుట 15 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెచేస్తున్నారు. బుధవారం మెదక్ చర్చికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తుండడంతో మెదక్ కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకొని సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను మెదక్ రూరల్ పీఎస్‌కు తరలించి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల టెంట్లు ముందు నుంచే వెళ్తున్న ముఖ్యమంత్రి...టెంట్లు పీకేయడం కాదు, వారి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. 15 రోజులుగా ఆందోళన చేస్తున్న వారి ఆవేదన అర్థం చేసుకోవాలని సూచించారు.అధికారంలోకి వచ్చిన వెంటనే చాయ్ తాగినంత సేపట్లో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని, వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఉలుకూ పలుకూలేదన్నారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న విధంగానే సమగ్ర శిక్షా ఉద్యోగులను కాంగ్రెస్ నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. నిర్బంధించిన సమగ్ర శిక్షా ఉద్యోగులను తక్షణం విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా హామీలన్నీ నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ పక్షాన ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నాగుబాయికి ఇల్లు కేటాయింపు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

గజ్వేల్, డిసెంబర్ 25: సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో 'మొండి గోడల మధ్యే జీవనం' కథనానికి స్పందించిన అధికారులు నాగుబాయికి సంగాపూర్‌లోని డబుల్ బెడ్ రూం ఇండ్లలో ఇంటిని కేటాయించారు. 139వ బ్లాక్‌లో ఇంటిని అధికారులు కేటాయిస్తూ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అధికారులు కేటాయించిన ఇంటిలోకి వెళ్లకముందే అనారోగ్యంతో బాధపడుతున్న నాగుబాయి బుధవారం మృతి చెందింది. అంత్యక్రియలు చేయలేని పరిస్థితి ఉండడంతో ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కుమారులు లేకపోవడంతో కూతురు దర్గాబాయి తలకొరివి పెట్టింది.


తల్లికి తలకొరివి పెట్టిన కూతురు


మెదక్ చర్చిలో శిలువ ఊరేగింపుతో ప్రారంభమైన క్రిస్మస్ వేడుకలు, శిలువను చర్చిలోకి తీసుకొస్తున్న మత గురువులు


మెదక్ చర్చిలో తెల్లవారుజామున నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

# క్రిస్మస్ సంబురాలు

- మెదక్ చర్చిలో వైభవంగా శతాబ్ది ఉత్సవాలు
- ప్రార్థనల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులు
- భక్తులను ఆశీర్వదించిన పాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 25: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రిస్మస్ సంబురాలు అంబరాన్నంటాయి. ఆసియాలోనే రెండో అతి పెద్ద చర్చిగా పేరుగాంచిన మెదక్ చర్చిలో బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు తెల్లవారుజామునే 4.30 గంటలకు శిలువ ఊరేగింపుతో ప్రారంభమయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే చాలామంది భక్తులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడానికి మెదక్ సీఎస్ఐ చర్చికి తరలి వచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో చర్చి కిక్కిరిసిపోయింది. లోక రక్షకుడు ఏసుప్రభు అని మెదక్ ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిలో ఉదయం 4.30 గంటలకు నిర్వహించిన తొలి ఆరాధన ప్రార్థనల్లో ఆయన పాల్గొని దైవ సందేశం ఇచ్చారు. విశ్వానికి మార్గం చూపే రక్షకుడు ఏసయ్య అని చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య అన్నారు.10 గంటలకు రెండో ఆరాధన ప్రార్థనల్లో ఆయన దైవ సందేశం ఇచ్చారు. పాస్టర్లు డేవిడ్, శ్రీనివాస్, జైపాల్ మెదక్ చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సంశాన్ సందీప్, జాన్సన్, సువన్‌డగ్లస్, జాయ్‌ముర్రె, భక్తులు పాల్గొన్నారు.

**భారీ ఏర్పాట్లు...పోలీసుల నిఘా**

క్రిస్మస్ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సీఎస్ఐ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. బస్సు డిపో ఎదురుగా మెయిన్‌గేట్ నుంచి మొదలుకొని చర్చి ముఖద్వారం వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. చర్చి ప్రధాన ద్వారం వద్ద పోలీసులు మెటల్ డిటెక్టర్లు, పోలీస్ డాగ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


దైవ సందేశం చేస్తున్న ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్


భక్తి గీతాలు ఆలపిస్తున్న మహిళలు


మెదక్ చర్చికి భారీగా తరలివస్తున్న భక్తులు



మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రంలో జ్ఞాపిక అందుకుంటున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు

### సేంద్రియ సేద్యం చేపట్టి
# చరిత్ర సృష్టించిన రైతులు

- ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్
- మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి గ్రామంలోని ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ రైతులతో సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి

నర్సాపూర్, కౌడిపల్లి, డిసెంబర్ 25: మెదక్ జిల్లాలో 655 మంది రైతు కుటుంబాలు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. బుధవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సతీమణి డాక్టర్ సుదేశ్‌ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, అటవీశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ..జిల్లాలో సేంద్రియ వ్యవసాయం చేసిన రైతులు, గ్రామ పంచాయతీ సభ్యులు తనకు ప్రత్యేక అతిథులు అని, వారికి ఢిల్లీలో ఆతిథ్యం ఇస్తానన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్క నాటి అక్కడే ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువులకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం కేవీకేలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. కొద్ది కాలంలోనే భారత్ ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతున్నదన్నారు. దేశంలోని 730పై చిలుకు కృషి విజ్ఞాన కేంద్రాలు, 150పై చిలుకు ఐకార్ సంస్థలు వేడుకల్లో భాగస్వాములు కావాలన్నారు. దేశంలోని ఇంధన, సహజ వనరులను అవసరం మేరకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ విద్యుత్ సబ్సిడీలపై ఆధారపడకుండా సోలార్ ఎనర్జీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు మళ్లీ ఆర్గానిక్ సాగు దిశగా అడుగులు వేస్తున్నారని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. ఆర్గానిక్ సాగు చేస్తున్న 800 మంది రైతులు సమ్మేళనంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఏకలవ్య కేవీకే సంస్థ ఆర్గానిక్ సాగు దిశలో రైతులకు మేలైన సహకారం అందించడంపై అభినందించారు. పదేండ్లలో ఎంతో మార్పు వచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.